క్లుప్తంగా

కేజీబీవీలో దంత వైద్య శిబిరం

ఎచ్చెర్ల : లావేరు మండలం మురపాక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా శనివారం విద్యార్థులకు ఉచితంగా దంతవైద్య పరీక్షలు నిర్వహించారు. ఓ ప్రైవేటు ఆస్పత్రి సౌజన్యంతో విద్యార్థులకు దంత సమస్యలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ బి.సుధ, సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగుడికి అండగా..



దాతలు, వైద్యులతో అప్పలనాయుడు

శ్రీకాకుళం కల్చరల్: రాజాం మండలం కంచరాంకు చెందిన దివ్యాంగుడు ఎలుకల అప్పలనాయుడు ఐదేళ్లుగా టీబీతో బాధపడుతూ మంచానికే పరిమితమయ్యాడు. పెద్దపాడుకు చెందిన బొట్టా సాయికుమార్ సౌజన్యంతో రెడ్‌క్రాస్ నేతృత్వంలో శనివారం మూడు చక్రాలకుర్చీని అప్పలనాయుడుకు అందజేశారు. జెమ్స్ వైద్యశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ హేమంత్, డాక్టర్ బి.జ్యోత్స్న, డాక్టర్ మోహన్, రెడ్‌క్రాస్ ప్రతినిధులు నంది ఉమాశంకర్, కొల్లు సత్యనారాయణ, జి.పవన్‌కుమార్, బి.జగదీష్, పొడుగు చరణ్, ఉర్లాం శివతేజ పాల్గొన్నారు.

అన్నప్రసాద వితరణ



అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని నక్కవీధి ఉమా జలలేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి మహోత్సవాల్లో భాగంగా శనివారం అన్నప్రసాద వితరణ నిర్వహించారు. సుమారు మూడు వేల మందికి అన్నప్రసాదాన్ని అందచేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు అశ్వనీకుమార్, మహేష్, భక్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి పూసర్లపాడు గ్రామదేవత ఉత్సవాలు



అసిరితల్లి అమ్మవారు

గార : పూసర్లపాడు గ్రామదేవత అసిరితల్లి (పిఠాపురం అమ్మవారు) ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభమవుతాయని ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. నాలుగు దశాబ్దాల తర్వాత జరుగుతున్న గ్రామదేవత ఉత్సవంలో భాగంగా ఆదివారం ఉదయం దేవర చూపులు, సోమవారం తల్లి ఘటాలు పూజ, మంగళవారం సిరిమాను ఊరేగింపు జరుగుతాయని పేర్కొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం రాత్రి డ్యాన్సు హంగామా, సోమవారం రాత్రి శివ భాగవతం, మంగళవారం రాత్రి సత్య హరిశ్చంద్ర పౌరాణిక నాటకం జరుగుతాయని, భక్తులంతా పాల్గొనాలని కోరారు.

హైవే స్థలంలో ఆక్రమణలు తొలగిస్తాం



కొలతలను పరిశీలిస్తున్న డిప్యూటీ మేనేజర్ సతీష్

రణస్థలం: రణస్థలం పట్టణంలోని జాతీయ రహదారుల సంస్థ ఆధీనంలో ఉన్న స్థలాల్లో ఆక్రమణలను ఈ నెల 3 నుంచి తొలగిస్తామని హైవే అథారిటీస్ విశాఖపట్నం జోన్ డిప్యూటీ మేనేజర్ సీహెచ్ సతీష్ తెలిపారు. జె.ఆర్.పురంలో ఫ్లై ఓవర్‌కు సంబంధించి హైవే కొలతలపై రీసర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్నిచోట్ల కొలతల్లో వ్యత్యాసం ఉండటంతో రీ సర్వే చేపట్టామని చెప్పారు. కార్యక్రమంలో సైట్ ఇంజినీర్ మహేష్, సర్వే అధికారులు, మాజీ ఎంపీపీ డీజీఎం ఆనందరావు పాల్గొన్నారు.

పక్కాగా ట్రిపుల్ ఐటీ మెస్ నిర్వహణ

ఎచ్చెర్ల క్యాంపస్: మెస్ నిర్వహణ సక్రమంగా ఉండాలని రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం ఎస్ఎంపురం క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకట గోపాల ధనబాలాజీ అన్నారు. శనివారం నిర్వహించిన మెస్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్యం, మెరుగైన నిర్వహణ, విద్యార్థుల ఆరోగ్యం లక్ష్యంగా ముందుకు సాగాలని చెప్పారు. విద్యార్థుల ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని, ఇంటి భోజనంలా విద్యార్థులు సంతృప్తి పడాలని అన్నారు. సమావేశంలో ఏవో ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ కొర్ల మోహన్‌కృష్ణ చౌదరి, వెల్ఫేర్ డీన్ గేదెల రవి, ఫైనాన్స్ ఆఫీసర్ వాసు, చీఫ్ వార్డెన్ నరసింహ మప్పుడు, మెస్ కో–ఆర్డినేటర్లు మల్లీశ్వరి, స్వామిబాబు పాల్గొన్నారు.

టెన్‌షన్ వీడితేనే విజయం

పది పరీక్షల షెడ్యూల్ ఇలా...	మార్చి 17	మార్చి 19	మార్చి21	మార్చి24	మార్చి26	మార్చి28	మార్చి31
	తెలుగు	హిందీ	ఇంగ్లిష్	గణితం	ఫిజిక్స్	బయాలజీ	సోషల్



అల్లినగరంలో విద్యార్థులకు ప్రత్యేకంగా చదివిస్తున్న ఉపాధ్యాయులు

- మార్చి 17 నుంచి టెన్త్ పరీక్షలు ఆరంభం
- ప్రణాళికాబద్ధంగా సిద్ధం కావాలంటున్న సబ్జెక్టు నిపుణులు



శ్రీకూర్మం రెడ్‌క్రాస్ జెడ్పీహెచ్ఎస్ స్కూల్లో ప్రత్యేక తరగతులు

ఎచ్చెర్ల/గార: పదో తరగతి పాసైతే విద్యార్థి జీవితంలో తొలిమెట్టు ఎక్కినట్లే. ఆ తర్వాత ప్రతి సంవత్సరం పబ్లిక్ పరీక్షలు రాయాల్సి ఉంటుంది. ఏ ఉద్యోగానికి అయినా టెన్త్ ఉత్తీర్ణతే తొలి అర్హతగా పరిగణిస్తారు. అందుకే ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాన్ని నిర్ణయించుకుని ప్రణాళికాబద్ధంగా పరీక్షలకు సన్నద్ధం కావాలి. మార్చి 17 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రతి సబ్జెక్ట్‌ను రివిజన్ చేసుకుంటే విజయం సునాయాసంగా చేరువవుతుందని, ముఖ్యంగా ఒత్తిడికి గురికాకుండా చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని సబ్జెక్టు నిపుణులు చెబుతున్నారు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. 100 రోజుల యాక్షన్‌ప్లాన్‌లో భాగంగా పాఠశాలల్లో పనివేళలు ముగిశాక సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. రోజూ ఉదయం 8.15 నుంచి 9.15 గంటల వరకూ సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకూ రోజుకో సబ్జెక్ట్ చొప్పున వారానికి 7 సబ్జెక్టలను రివిజన్ చేయిస్తున్నారు. ఒత్తిడి లేకుండా పరీక్షలు ఎలా సన్నద్ధమవ్వాలో శిక్షణ ఇస్తున్నారు. ఉపాధ్యాయులే స్వయంగా విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి పరీక్షల ఆవశ్యకతను వివరిస్తున్నారు. పరీక్షలు పూర్తయ్యే వరకు ఇళ్లల్లో మొబైల్‌గేమ్స్, సోషల్‌మీడియా, కొత్త సినిమా కబుర్లు, క్రికెట్‌మ్యాచ్‌లు వంటి జోలికెళ్లకుండా తల్లిదండ్రులు దష్టిపెట్టాలని స్పష్టంచేస్తున్నారు. మిగిలిన కొద్ది సమయాన్ని సంపూర్ణంగా, సమర్థవంతంగా వినియోగించుకోవాలని బోధిస్తున్నారు. నెలలు తరబడి నేర్చుకున్న పాఠాలను ప్రణాళికాబద్ధంగా రివిజన్ చేసుకోవాలని వివరిస్తున్నారు.

భాషాంశాలపై పట్టుండాలి



అలంకారాలు, చంధస్సు, అర్థాలు, పర్యాయపదాలు, జాతీయాలు వంటి భాషాంశాలపై 22 నుంచి 32 వరకు ప్రశ్నలుంటాయి. వీటిపై పట్టు సాధించి చేతిరాతపై దృష్టి సారించాలి.

– శ్రీదేవి, తెలుగు పండిట్, జెడ్పీహెచ్ఎస్, శ్రీకూర్మం

గణితం కీలకం



వందకు వంద శాతం మార్కుల సాధనకు అవకాశమున్న ఏకైక సబ్జెక్టు గణితం. ప్రతి చాప్టర్‌ను బాగా అధ్యయనం చేసి, లెక్కలు చక్కగా సాధన చేస్తే మంచి మార్కులు వస్తాయి.

– ఎస్.పద్మావతి, గణిత ఉపాధ్యాయురాలు, బాలికా హైస్కూల్, శ్రీకూర్మం

ఒత్తిడికి దూరం..



ప్రతి పరీక్ష మధ్య ఒక రోజు సెలవు రావడం వల్ల ఒత్తిడి బాగా తగ్గించుకునేందుకు మంచి అవకాశం. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఈ సమయాన్ని పిల్లలు సద్వినియోగం చేసుకునేలా దృష్టి పెట్టాలి.

– ఎస్. రామకృష్ణ, ఎంఈవో–1, గార

చేతిరాతకు పని పెట్టాలి



రివిజన్‌తో పాటు ప్రశ్న, జవాబులను రెండు, మూడు సార్లు రాయడం ద్వారా పూర్తి స్థాయిలో గుర్తుంటుంది. పరీక్షలు రాసేటప్పుడు ప్రశ్నను బాగా చదివి అర్థం చేసుకొని సమాధానాలు రాయాలి.

– పద్మిని, హిందీ టీచర్, అల్లినగరం

వాటిని దూరంపెట్టండి



కష్టపడి చదవాలని రాత్రిళ్లు ఎక్కువగా మేల్కొని ఆరోగ్యాన్ని పాడు చేసుకోవద్దు. సినిమాలు, టీవీలు, ఇతరత్రా వినోద కార్యక్రమాలకు పరీక్షలు ముగిసే వరకు దూరంగా ఉండాలి.

– కె.శ్రీలక్ష్మి, గణితం టీచర్, అల్లినగరం

ఆత్మవిశ్వాసం అవసరం



ఇతరులతో పోల్చుకుని నిరుత్సాహపడకూడదు. విజయం సాధించబోతున్నామని భావించి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలి. సామర్థ్యాన్ని గుర్తించి సరైన ప్రశ్నలను ఎంపిక చేసుకోవాలి.

– సౌభాగ్యలక్ష్మి, తెలుగు టీచర్, అల్లినగరం

పీజీఆర్ఎస్ దరఖాస్తులపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో సాయిప్రత్యూష

రణస్థలం : పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెస్సెస్ సిస్టమ్ (ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక) దరఖాస్తులకు శత శాతం పరిష్కారం చూపాలని శ్రీకాకుళం ఆర్డీఓ కె.సాయిప్రత్యూష సిబ్బందికి సూచించారు. రణస్థలం తహసీల్దార్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 2080 పీజీఆర్ఎస్ దరఖాస్తులకు గాను సర్వే పరంగా 360, రెవెన్యూ సమస్యల పరంగా 368 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. ఇందుకు గల కారణాలపై అధికారులతో సమీక్షించారు. తొలుత పైడిభీమవరంలోని ఆంధ్రా ఆర్గానిక్స్ లిమిటెడ్ పరిశ్రమను సందర్శించారు. సమావేశంలో సూపరింటెండెంట్ డి.నారాయణమూర్తి, రీసర్వే డీడీటీ తార శ్రీదేవి, మండల సర్వేయర్ ఎస్.రవి, రెవెన్యూ పరిశీలకులు ఎం.సతీష్, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆశీలు వసూలుపై ఆందోళన

శ్రీకాకుళం: నగర కార్పొరేషన్‌లో రోడ్డు పక్కన వ్యాపారాలు చేస్తున్న వారు, తోపుడు బళ్లు, ఇతర వ్యాపారుల నుంచి ఆశీలు వసూలు చేయటంపై వారంతా ఆందోళన చెందుతున్నారు. జీఎస్టీ చెల్లిస్తున్నప్పటికీ అనధికారికంగా ఆశీలు వసూలు చేస్తున్నారని బాధితులు వాపోతున్నారు. తామంతా ఆశీలు చెల్లించే పరిధిలో లేనప్పటికీ అనవసర బాదుడు తప్పటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి పత్రాలు లేకుండా రోజుకు రూ.100 నుంచి రూ.200 వరకు వసూలు చేస్తున్నారని మండిపడుతున్నారు. జీఎస్టీ చెల్లించి, అన్ని పన్నులు కట్టి, అన్ని పత్రాలతో సరుకులు తీసుకుని వచ్చిన లారీల వద్ద ఆశీలు వసూలు చేసేందుకు కాంట్రాక్టర్ సంబంధీకులు సిద్ధం కావడంతో శనివారం పెద్దపాడు రోడ్డులో రగడ చోటుచేసుకుంది. ఆశీలు చెల్లించకపోతే సరుకులు దించకుండా వెనక్కి వెళ్లిపోవాలని అడ్డుకున్నారు. దీంతో ఆందోళన చెందిన షాపు యజమానులు, లారీ డ్రైవర్లు జిల్లా ఎస్పీకి నేరుగా ఫోన్ చేశారు. అక్కడికి చేరుకున్న పోలీసులు ఇలాంటి సమస్యలు కార్పొరేషన్ అధికారులు వద్ద కాంట్రాక్టర్ తేల్చుకోవాలని, షాపుల వద్ద అడ్డుకుని గొడవలు చేయవద్దని తెల్పి చెప్పారు. ఈ నెల 31వ తేదీకి ఆశీలు వసూలు కాంట్రాక్ట్ గడువు ముగుస్తుంది. దీంతో అనధికార వసూళ్లకు పాల్పడుతున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. రశీదు ఇస్తే రూ.200, రశీదు వద్దనుకుంటే రూ.150 నుంచి రూ.100 వరకు అనధికారికంగా వసూలు చేస్తున్నారని వ్యాపారులు చెబుతున్నారు. దీనిపై మున్సిపల్, రెవెన్యూ అధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

మాదిగ అమరవీరులకు జోహార్



అమరవీరులకు నివాళులర్పిస్తున్న మాదిగ సంఘ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మాదిగ జాతి అభివృద్ధికి కృషి చేసిన అమరవీరుల సేవలు మరువలేనివని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సభ్యుడు దాసరి తిరుమలరావు మాదిగ అన్నారు. శనివారం పాత శ్రీకాకుళం హరిజన వీధి కమిటీ హాలు వద్ద మాదిగ అమరవీరులకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ లక్ష్య సాధనకు అమరులైన వారిని స్మరించుకోవడం మనందరి బాధ్యతని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు లోపింటి తేజేశ్వరరావు, పార్వతీపురం మన్యం జిల్లా ఇన్‌చార్జి బోసు మన్మధరావు, ఉమ్మడి జిల్లాల మాజీ అధ్యక్షులు లోపింటి కృష్ణ మాదిగ, కంటపాక యమా శేఖర్ మాదిగ, కానుకుర్తి గోవింద, పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

బాలికల చదువుతోనే సమాజ వికాసం



శ్రీకాకుళం అర్బన్: గూనపాలెం సెక్టార్‌లో కిశోరి బాలికల సైకిల్ ర్యాలీ



శ్రీకాకుళం అర్బన్: కృష్ణాపార్కు సెక్టార్‌లో సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: సమాజంలో ఆడబిడ్డ అంటే చిన్నచూపు ఉందని, దీనిని పోగొట్టేందుకు తల్లిదండ్రులు బాలికలను ఉన్నత చదువులు చదివించాలని వక్తలు పిలుపునిచ్చారు. శనివారం గూనపాలెం, కృష్ణాపార్కు సెక్టార్ల ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది కిశోరీ వికాసం ర్యాలీలు నిర్వహించారు. బాలికల చదువు ఆవశ్యకత, బాల్య వివాహాలు, డ్రగ్స్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం బాలికలతో కలిసి సైకిల్ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమాల్లో ప్రాజెక్టు అధికారి జి.శోభారాణి, హెచ్ఎం ఎం.లక్ష్మి, సూపర్‌వైజర్ బి.యోగీశ్వరి, పి.సీతామహాలక్ష్మి, ఎం.ఎస్.కె.రత్నకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు కె.కల్యాణి, టి.రాజేశ్వరి, ఆదిలక్ష్మి, హైమవతి, హెచ్.విజయలక్ష్మి, నాగమణి, రోజా, లత, భానుమతి, వామక్షి, సరిత, పైడి లక్ష్మి, కళావతి తదితరులు పాల్గొన్నారు.



ఎచ్చెర్ల క్యాంపస్: సమావేశంలో చర్చిస్తున్న కమిటీ సభ్యులు

ఎచ్చెర్ల క్యాంపస్: బాల్య వివాహాలు నేరమని ఎచ్చెర్ల ఐసీడీఎస్ పీవో డి.పాపినాయుడు అన్నారు. బాల్య వివాహాలపై శనివారం పంచిరెడ్డిపేటలో శనివారం బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో బాల్య వివాహాల నియంత్రణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు పన్నుల చెల్లింపునకు అవకాశం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): 2024–25కి సంబంధించి ఇంటిపన్నులు, ఆస్తిపన్నులు, కుళాయి పన్నులు, ఖాళీ స్థలాల పన్నులు చెల్లించేందుకు ఆదివారం కూడా కౌంటర్లు అందుబాటులో ఉంటాయని నగరపాలక సంస్థ కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాదరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పన్నులు చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని కోరారు.

ట్రేడ్‌లైసెన్స్ తప్పనిసరి



లైసెన్సులు తనిఖీ చేస్తున్న హెల్త్ ఆఫీసర్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నగరంలో వ్యాపారులంతా ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలని, లేకుంటే చర్యలు తప్పవని కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సుధీర్ హెచ్చరించారు. పొట్టి శ్రీరాములు మార్కెట్ తదితర ప్రాంతాల్లో ట్రేడ్ లైసెన్సులను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఉత్పత్తులను సీజ్ చేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్లు, శానిటేషన్ సెక్రటరీలు, శానిటేషన్ మేస్త్రీలు పాల్గొన్నారు.

వెంకన్నకు విశేష పూజలు



శ్రీకాకుళం కల్చరల్: పీఎన్ కాలనీలోని నారాయణ తిరుమల కొండపై వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయం, చిన్నబజారులోని దూదివారి వేంకటేశ్వర ఆలయం, మొండేటివీధిలోని వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రేపు శ్రీకాకుళంలో జాబ్‌మేళా

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల వేదికగా నోడల్ రిసోర్స్ సెంటర్, జేకేసీ ఆధ్వర్యంలో ఈ నెల 3న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ వై.పోలినాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. 12 కంపెనీల ప్రతినిధులు హాజరై 700 వరకు ఖాళీలను భర్తీ చేస్తారని పేర్కొన్నారు. టెన్త్‌క్లాస్, ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్ వరకు అర్హతలు కలిగి 18 నుంచి 35 ఏళ్ల వయస్సు కలిగిన స్త్రీ, పురుషులు అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు సోమవారం ఉదయం 9.30 గంటలకు అన్ని సర్టిఫికెట్లతో జేకేసీ కోఆర్డినేటర్ వై.మణికు మార్‌ను సంప్రదించాలన్నారు. పూర్తి వివరాలకు 99490 94968, 93465 77596 నంబర్లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

ఊయల ఇలా..ఊగేదెలా?



శ్రీకాకుళం నగరంలోని అఫీషియల్ కాలనీలో అబ్దుల్ కలాం పార్కులో ఆట వస్తువులు విరిగిపోవడంతో చిన్నారులకు ఇబ్బందులు తప్పడం లేదు. నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో పరిసరాలు అధ్వానంగా మారాయి. కనీసం ఊయల బల్ల కూడా లేకపోవడంతో టైర్లు కట్టి ఊగాల్సిన పరిస్థితి నెలకొంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

మొక్కలు ఎండాయి.. డొక్కులు మిగిలాయి!



రథసప్తమి సందర్భంగా తీసుకొచ్చిన మొక్కలను సంరక్షించడంలో అధికారులు విఫలమయ్యారు. మొక్కల కొనుగోలుకు సుడా నుంచి రూ.30లక్షలకు పైగా ఖర్చు చేసినా ఆ తర్వాత తమకేం సంబంధం లేదన్నట్లు నిర్లక్ష్యం వహించారు. ఈ విషయమై సాక్షిలో 'మొక్కలంటే లెక్కలేదా' అనే శీర్షికన ఇటీవల కథనం ప్రచురితమైంది. దీంతో ఎండిన మొక్కలు సుడా కార్యాలయ సిబ్బందితో బయటపడేయించి.. డొక్కులన్నీ ఒక చోటచేర్చి వదిలేశారు.

– శ్రీకాకుళం (పీఎన్ కాలనీ)

ఆల్ ది బెస్ట్



ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు శనివారం ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థులు ధైర్యంగా ఆత్మ విశ్వాసంతో పరీక్షలు రాయాలని జి.సిగడాం మోడల్ స్కూల్ ఎస్ఓ కుమారి చెప్పారు. ఈ మేరకు శనివారం జి.సిగడాం జూనియర్ కళాశాలలో పరీక్ష రాసేందుకు వెళ్తున్న బాలికలకు ఆల్ ది బెస్ట్ చెప్పారు.

– జి.సిగడాం

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న వ్యక్తిత్వ వికాస నిపుణురాలు సీత

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ప్రతిఒక్కరూ నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని వ్యక్తిత్వ వికాస నిపుణురాలు ముద్దాడ సీత అన్నారు. శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాలలో అఖిల భారత విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో విద్యార్థులకు శనివారం నాయకత్వ, వ్యక్తిత్వ లక్షణాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రేరణాత్మక ప్రసంగాలు విద్యార్థుల అభివృద్ధి, శ్రేయస్సులో కీలకపాత్ర పోషిస్తాయని చెప్పారు. వైస్ ప్రిన్సిపల్ పోలినాయుడు మాట్లాడుతూ జీవితంలో సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలన్నారు. ఏబీవీపీ జిల్లా కన్వీనర్ బోర గోపి మాట్లాడుతూ యువత శక్తివంతంగా ఉండాలని, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో సత్యసాయి, జాడ సాయి, ఆర్ట్స్ కళాశాల ప్రెసిడెంట్ నందు, సాత్విక్, ఉదయ్, సాయి ఏబీవీపీ సభ్యులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



ప్రదర్శనలో ఓ సన్నివేశం

శ్రీకాకుళమ కల్చరల్: జిల్లా కేంద్రంలోని బాపూజీ కళామందిర్‌లో రంగస్థల కళాకారుల 305వ నెలవారీ సాంస్కృతిక కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన 'కొడుకు పుట్టాలి, సత్యహరిశ్చంద్ర, ఆవిడే సర్దుకుపోవాలి, చెవిటిమావ – చిరాకు అల్లుడు, మాయలమరాఠి, లాయర్–జడ్జి స్కిట్‌లు అలరించాయి. అనంతరం కల్యాణం రామమోహనరావు ఆధ్వర్యంలో జరిగిన సినీ సంగీత విభావరిలో కళాకారులు చక్కని గీతాలు ఆలపించారు. పేద వృద్ధ కళాకారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఎల్.రామలింగస్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో యడ్ల గోపాలరావు, పల్లా ప్రకాష్, డాక్టర్ బెండి సాయిరాం, తెప్పల కృష్ణమూర్తి, పన్నాల నర్సింహమూర్తి, బి.రామచంద్రదేవ్, పొట్నూరు వెంకట్రావ్, సత్యవతి, కలగ గణేష్‌యాదవ్, జ్యోతి, ఐ.రమణారావు, మెట్ట పోలినాయుడు, వెంకటరాజు, అగతమూడి సింహాచలం, గజల్ వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు



మహిళా కళాశాల కేంద్రాన్ని సందర్శించిన ఎస్పీ



గార: పరీక్ష రాసేందుకు వెళుతున్న విద్యార్థులు

శ్రీకాకుళం క్రైమ్ : ఇంటర్ పరీక్షలు శనివారం నుంచి ప్రారంభమైన నేపథ్యంలో శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాల కేంద్రాన్ని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పరీక్ష రాసే విద్యార్థులకు ఎటువంటి అంతరాయం కలగకుండా పటిష్ట పోలీసు బందోబస్తు నిర్వర్తించాలని, 144 సెక్షన్ అమల్లో ఉన్నందున విద్యార్థులు మినహా ఇతరులను అనుమతించరాదని అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. మాస్ కాపీయింగ్, మాల్‌ప్రాక్టీస్ వంటివి పాల్పడరాదని, సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ వంటివి తీసుకురావద్దని సూచించారు.

గార: కోకా వారి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రశాంత వాతావరణంలో ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొత్తం 201 మంది విద్యార్థులకు ఎనిమిది మంది గైర్హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ మావూరి ఇందిర తెలిపారు.

జి.సిగడాం: జి.సిగడాం జూనియర్ కళాశాల కేంద్రంలో ప్రారంభమైన ఇంటర్ పరీక్షలకు 237 మందికి గాను 234 మంది హాజరయ్యారు.

ప్రజలను మభ్యపెట్టేలా బడ్జెట్

శ్రీకాకుళం అర్బన్: కూటమి ప్రభుత్వం భారీ అంకెలతో ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలను మభ్యపెట్టేదిగా ఉందని డీసీసీ అధ్యక్షుడు అంబటి కృష్ణారావు అన్నారు. ఇందిరావిజ్ఞానభవన్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ వ్యవసాయంపై 60 శాతం జనాభా ఆధారపడి ఉన్న రైతులకు అర కొరగా నిధులు కేటాయించడం దారుణమన్నారు.